తెలుగు కళా సమితి
(మ్యాజెర్సీ)
చిన్న కథల పోటీలో
రు. 150
గెలుపొందిన
రచన

# తెల్లవారింది

—దంటూరి
చిన రామచంద్రరావు

అది హాస్పిటలు...

లోపల ఎన్నో ఆపరేషన్లు, డ్రస్సింగులు, హడావుడి. అయినా ఎంతో నిశ్శబ్దం! ఎంతోమంది డాక్టర్లు, నర్సులు, రోగులు-అయినా ఎంతో పరిశుభ్రత!

ఆమె మంచం మీద వుంది. అతడు దగ్గర్లోనే కూర్చున్నాడు. నర్సుతో సహా డాక్టర్ వచ్చాడు. చూసి, "గుడ్ ఇంప్రూవ్‌మెంట్" అన్నాడు.

"ఎలా వుంది...?" అడిగాడతడు డాక్టర్ వెళ్లగానే!

ఆమె లేచి కూర్చుని "బాగా నయం- చప్పున ఇంటికి చేరాలని వుంది" అంది.

అదే అతనికి కావలసింది కూడా!

పన్నెండు కాకుండానే ఆమె పాలూ, బ్రెడ్డూ తీసుకుంది. అతడు వెళ్ళిపోయాడు. మళ్ళీ రేపు పొద్దున్న కాని రాడు.

టింకూ, సీనాలని స్కూల్లో దిగబెట్టి ఆయా వచ్చింది. సాయంత్రం వరకూ వుండి వెళ్లింది.

అటెండర్ పిల్లల్ని స్కూలు నుంచి తీసుకొచ్చాడు. వాళ్ళు తల్లి పక్కలో చేరారు. సీనా జుట్టు సవరించి టింకూ షర్ట్ కాలరు సర్దింది. "స్కూల్లో అల్లరి చెయ్యడం లేదుగదా...?" అని ప్రశ్నించింది.

"నెవర్ మమ్మీ" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

ఆమె నవ్వింది. ఇద్దర్నీ దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంది. అటెండర్‌తో పిల్లలు వెళ్ళిపోయారు.

రాత్రి మళ్లీ అటెండరు వచ్చాడు.

తెల్లవారింది.

ఆమె బ్రష్ చేసుకుని, కాఫీ త్రాగింది. అతడు ఇంకా రాలేదు.

నర్సుతో డాక్టర్ వచ్చి చూశాడు.

"ఈ సిటీ గాలి నాకు పడదు డాక్టర్" అంది ఆమె.

ఆయన సన్నగా నవ్వి "నథింగ్ టు వర్రీ" అని వెళ్లిపోయాడు.

తొమ్మిది దాటినా ఇంకా అతడు రాలేదు.

ఆమెకు తెలుసు- అతడు ఇంట్లోనూ వుండడు. రాత్రి రూబీ బంగళాలో వుంటాడు. లేదా ఆశా ఫ్లాట్‌లో గడిపి వస్తాడు. పిల్లల మీద ప్రేమ వుంది- కాని మమకారం లేదు. తనంటే ఇష్టం వుంది- అనురాగం లేదు. అతడు మిలిటరీ కమాండెంట్.

ఏది ఏమైనా అతడే తనకు దేవుడు.

నిజానికి ఆమె చదువుకున్నది కాదు. కాని అందాలరాశి. అతనిలో అందం లేదు. బలం వుంది. పెద్ద ఆఫీసరు.

ఆమె లేత తమలపాకు. అతనిది శిలా కర్కశత్వం. ఆమెలో దురుసుతనం లేదు. అతనిలో దూకుడు జాస్తి...

అతడు వచ్చి "ఎలా వుంది?" అని అడిగాడు.

"ఫరవాలేదు" అందామె.

"డాక్టర్ చూసి వెళ్ళాడా?"

"ఊ..."

"ఏమన్నాడు?"

"అదే మాట అన్నాడు"

అతనికి తృప్తిగా లేదు.

కాసేపు కూర్చుని 'బైబై' అంటూ వెళ్ళిపోయాడు.

ఆయా వచ్చింది. సాయంత్రం వెళ్ళింది.

అటెండరూ, పిల్లలూ వచ్చి వెళ్ళారు.

అటెండరు తిరిగి రాత్రి వచ్చాడు.

తెల్లవారింది.

పిల్లలు ఎగిరి గంతులు వేశారు. అటెండరు, ఆయా ఎంతో సంతోషించారు.

ఆమె ఇంట్లో అటూ, ఇటూ మసులుతోంది. సాయంత్రం గార్డెన్‌లోకి వెళ్లి పువ్వుల్ని ముద్దుపెట్టుకుంది. అందుకే స్త్రీ కుసుమ కోమలం. పుష్ప సుగంధి.

చీకటి పడుతుంటే ఆమె వేడి వేడి టీ తాగింది.

ఎప్పుడో తీసుకున్న రెస్ట్రిక్టెడ్ మీల్స్. ఆకలి వేస్తోంది. అయినా రాత్రికి మిల్కూ, బ్రెడ్డే.

అతడు వార్డు టైముకే వచ్చాడావేళ.

"ఎందుకో?" అనుకుందామె.

డాక్టరు వచ్చి చూశాడు.

"రేపిడ్ ఇంప్రూవ్‌మెంట్" అన్నాడు.

అతనికి సంతోషం కలిగింది.

"ఇక ఇంటికి తీసుకువెళ్లొచ్చా?" అడిగాడు.

"డిశ్చార్జికి సూపరింటెండెంట్ పర్మిషన్ కావాలి" అన్నాడు డాక్టర్.

సూపరింటెండెంట్‌ను కలిసి అడిగాడతను.

"షి ఈజ్ జస్ట్ రికవరింగ్... డిశ్చార్జ్‌కి ఇంకా నాలుగు రోజులు ఆగాలి" అన్నారాయన.

అతడు వెళ్లిపోయాడు.

అతనికి సెలవు అయిపోతోంది.

రెండు రోజులు గడిచాయి.

ఆ వేళ ఉదయమే అతడు వచ్చాడు. ఆమెను చూడనేలేదు. డైరెక్ట్‌గా సూపరింటెండెంట్ రూమ్‌కు వెళ్ళాడు. ఏం చెప్పాడో ఏమో-

"ఆల్ రైట్... ఆమెను డిశ్చార్జ్ చేస్తున్నాను... కాని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. షి ఈజ్ టూ వీక్" అన్నాడు.

అతడూ, ఆమె ఇల్లు చేరారు.

## సుపుత్రుడు

"నేనెన్ని సార్లు చెప్పినా సిగ్గు లేదురా వెధవా... మా కాలంలో అయితే, మేం వీధి దీపం క్రింద చదువుకొని మొదటి క్లాస్‌లో పాసయ్యేవాళ్ళం" కోపంగా అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఇప్పుడు వీథుల్లో దీపాలెక్కడ వెలుగుతున్నాయసలు" కుమారరత్నం ఎదురు ప్రశ్న.

—కె.వి.అక్కయ్య



"ఎలా వుంది!" అడిగాడతను- గదిలోకి వచ్చి.

"ఫరవాలేదు..."

"ఎప్పుడూ ఆ మాటే అంటావ్..."

"... ... ... ..."

ఆమె దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. ఆమె కుడి చేతిని అతని చేతిలోకి తీసుకున్నాడు. ఆప్యాయంగా నిమిరాడు. ఆమె అతని కళ్లల్లోకి చూసింది.

"పెద్దగా రిలీఫ్ ఏం ఫీలవడంలేదా?" అడిగాడు.

ఆమె ఏమీ అనలేదు.

ఆమె గడ్డం పట్టుకుని మొహం తన వైపు తిప్పుకుని "నన్నే అడిగేది" అన్నాడు.

"మీకు తెలియదా?" అందామె.

పిల్లలు నిద్రపోతున్నారు. ఆయా క్రింద గదిలో పడుకుంది. అటెండరు ఎప్పుడో వెళ్లిపోయాడు.

"చలి వేస్తోంది... ఆ శాలువా ఇలా ఇవ్వండి" అందామె.

శాలువా తెచ్చి అతనే కప్పాడు.

"ఇంకా చలేమిటి...?" అన్నాడు.

"టెంపరేచర్ కనీసం 99 వుంటుంది" అందామె.

"ఆ మాత్రం అందరికీ వుంటుంది"

ఆ మాట ఆమెకి నచ్చలేదు.

"నీకు నచ్చదని నాకు తెలుసు" అన్నాడతను.

ఆమె ఏమీ అనలేదు.

"ఆడవాళ్ల నైజమే అంత..." అన్నాడు.

ఆమె పక్కనే పడుకున్నాడు. "ఒళ్ళు వెచ్చగా ఏం లేదే" అన్నాడు.

ఆమెకు ఎందుకనో భయం వేసింది.

అతను పెద్ద హోదాలో వున్న మనిషి. మిలిటరీ అధికారి. ఏదీ లెక్కచెయ్యడు.

ఆమె చెబుతూనే వుంది. "కనీసం ముద్దు అయినా నిషమే ఇవ్వదు" అని.

అతడు వినిపించుకోలేదు. తొందరపడ్డాడు.

తెల్లవారింది.

ఆమె లోకం విడిచి వెళ్లిపోయింది.

అతడు మిలిటరీ క్యాంపుకి వెళ్లిపోయాడు.

ఆ మర్నాడే అతన్ని చేరింది ఆశా!



